క్లుప్తంగా

సీఎం సమీక్షకు తరలిన అధికార బృందం



సమీక్షకు వెళ్లిన గ్రామ పరిపాలన అధికారులు

కందుకూరు: రెవెన్యూ వ్యవస్థలో వీఆర్ఓల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారుల నియామకాన్ని చేపట్టింది. అందులో భాగంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైటెక్స్‌లో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాలను అందుకోవడానికి కందుకూరు డివిజన్ నుంచి తహసీల్దార్ గోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో గ్రామ పరిపాలనాధికారుల బృందం తరలివెళ్లింది. డివిజన్‌లో మొత్తం 43 మంది ఉండగా.. 35 మంది వెళ్లారు. వారితో పాటు నాయబ్ తహసీల్దార్ శేఖర్, ఆర్ఐలు యాదగిరి, శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ ఉన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కందుకూరు: మిలాద్–ఉన్–నబీ పండుగ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మసీద్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వారోత్సవాలను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి కోరారు. ఈ నెల 11 నుంచి 17 వరకు వారోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. శుక్రవారం చేవెళ్లలో పార్టీ మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు వ్యతిరేకంగా 1946 నుంచి 1951 వరకు సాయిధ పోరాట తిరుగుబాటు జరిగిందన్నారు. ఈ పోరులో 4,500ల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. నిజాం పాలన అంతం చేసి హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం అయిందన్నారు. భూస్వాముల దోపిడీని అడ్డుకొని రైతుల హక్కులను పరిరక్షించారని చెప్పారు. హైదరాబాద్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ముగింపు సభ ఉంటుందని వివరించారు. ఈ వారోత్సవాల్లో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ప్రభులింగం, సత్యనారాయణ, మంజుల, మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

కేశంపేట: విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్ చెప్పారు. శుక్రవారం మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో రూ.10లక్షలతో చేపడుతున్న విద్యుత్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాత విద్యుత్ వైర్లను తొలగించి నూతన లైన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, ముత్యాలు, ఖాజాపాష, జంగయ్య, మల్లయ్య, శ్రీశైలం, జానకిరాములు, అజీత్‌ఖాన్, మునీర్, ఫెరోజ్, యాదయ్య, రఫీక్, జిలాని, కాంట్రాక్టర్ ధనుష్, లైన్‌మెన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

‘గెలుపు కోసమే జీఎస్టీ స్లాబ్‌లు తగ్గింపు’

మొయినాబాద్‌రూరల్: దేశంలో సమీపిస్తున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌లు తగ్గించిందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల సీనియర్ నాయకుడు నిరంజన్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన జీఎస్టీ స్లాబ్‌ల మార్పులు కేవలం బిహార్ ఎన్నికల కోసమే అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని పేర్కొన్నారు.



తుక్కుగూడ: బొడ్రాయి ఉత్సవ కమిటీ గణపతి లడ్డూను రూ.7,55,100లకు సొంతం చేసుకున్న భక్తుడు ప్రకాష్‌రెడ్డి



తుక్కుగూడ: రావిర్యాలలో డీసీపీ సునితారెడ్డికి అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించిన ఉత్సవ కమిటీ సభ్యులు



బడంగ్‌పేట: వీరాంజనేయ భక్త సమాజం గణపతి సన్నిధిలో ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, కుటుంబీకులు

బైబై గణేశా..

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడికి శుక్రవారం భక్తజనం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. 10వ రోజు కావడంతో నవరాత్రులు పూజలందుకున్న బొజ్జగణపయ్యను పలుచోట్ల ఊరేగింపుగా, ఆటపాటలతో గంగమ్మ ఒడికి చేర్చారు. నిమజ్జనాన్ని పురస్కరించుకొని స్వామివారి చేతిలోని లడ్డూను వేలంలో కైవసం చేసుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. రూ.లక్షలు వెచ్చించి సొంతం చేసుకున్నారు.

–సాక్షి, నెట్‌వర్క్



కందుకూరు: జైత్వారంలో నిమజ్జనానికి..



తుక్కుగూడ: రావిర్యాలలో గణపతి శోభాయాత్ర



పహాడీషరీఫ్: జల్‌పల్లి చెరువులో గణనాథుల నిమజ్జనం



పహాడీషరీఫ్: నిమజ్జన సరళిని పర్యవేక్షిస్తున్న సీఐ రాఘవేందర్ రెడ్డి



కందుకూరు: రాచులూరులో లడ్డూతో భక్తుడు

గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి



విద్యార్థి కాలుపై కనిపిస్తున్న గాయాలు

కొందుర్గు: హాస్టల్‌లో చదువుకుంటున్న తమ బిడ్డను గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని ఓ విద్యార్థి తల్లి పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన శుక్రవారం కొందుర్గు పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పాత ఆగిర్యాల గ్రామానికి చెందిన పాత్లావత్ తరుణ్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఉంటూ 7వ తరగతి చదువుకుంటున్నాడు. ఎప్పటిలాగే తరుణ్ గురువారం రాత్రి హాస్టల్ గదిలో నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు గుర్తు తెలియని పిల్లలు అతడి కాళ్లు, చేతులు పట్టుకొని నోట్లో పేపర్‌లు కుక్కి పెన్నుతో గాయపరిచారు. ఈ విషయాన్ని ఉదయం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో తరుణ్ తల్లి కవిత అక్కడికి వచ్చి గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కడ్తాల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రం, పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మక్తమాధారంలో ప్రిన్సిపాల్ రమేశ్‌ను పూర్వ విద్యార్థులు యాదగిరి, జంగయ్య, రాఖీలు ఘనంగా సన్మానించారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు తలకొండపల్లి మండల కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను నాయకులు సన్మానించారు.



ఆమనగల్లు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆమనగల్లు: తలకొండపల్లి మండల గ్రామీణ వైద్యుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్, ఉపాధ్యక్షుడిగా పాండు, ప్రధాన కార్యదర్శిగా శివకృష్ణ, కార్యదర్శులుగా రామకృష్ణ, శేఖర్, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్, కోశాధికారిగా శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా ప్రభాకర్, జగన్, మాణిక్యం, గౌరవాధ్యక్షులుగా రవి, ప్రసాద్‌లను నియమించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను సన్మానించారు.

అక్రమాలను నిరూపిస్తే దేనికైనా సిద్ధం

షాద్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్ సవాల్ విసిరారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల పదవీకాలంలో అక్రమాలకు పాల్పడలేదని, గుంట భూమి కొనలేదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పుడు అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఆయన అందినకాడికి దోచుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం చూస్తుంటే దొంగే..దొంగ దొంగ అన్నట్లు ఉందన్నారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతి గురించి ఎమ్మెల్యే శంకర్ మాట్లాడితే ఇక్కడి బీఆర్ఎస్ నేతలకు కడుపుమంట ఎందుకని ఎద్దేవా చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రఘునాయక్, తిరుపతిరెడ్డి, బస్వం, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీను, గోవర్ధన్‌గౌడ్, సత్యంరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అలీఖాన్‌బాబర్

ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్ భరత్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని సూచించారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, నిరంజన్‌గౌడ్, రవీందర్ రెడ్డి, మానయ్య, కేబుల్ రాజు, కిరణ్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద కాంగ్రెస్ నాయకులు

రోడ్డుపై గుంత.. ప్రయాణానికి చింత



మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్–నదీమ్‌నగర్ గ్రామాల మధ్య రహదారి మూల మలుపు వద్ద ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఎదురవుతోంది. మోకాళ్లలోతు గుంత రాత్రిపూట కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి



వైద్య శిబిరంలో పశువైద్యాధికారి మధుసూదన్ తదితరులు

మంచాల: పశు పోషణ సక్రమంగా లేకపోతే నష్టం జరుగుతుందని, పెంపకం విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. శుక్రవారం మండల పరిధి అస్మత్‌పూర్‌లో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువులకు గర్భదారణ పరీక్షలు, గర్భకోశవ్యాధి చికిత్స, దూడలకు నట్టల నివారణ మందులు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య శాఖ జిల్లా అధికారులు పున్నయ్య, రమణ, మండల వైద్యాధికారి సుధారెడ్డి, వైద్యులు సుధా, వసంత, సహాయకులు మల్లేశ్వరి, వీరారెడ్డి, బాలు, శ్రీను పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో మేలు

తుర్కయంజాల్: జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో మందికి మేలు చేకూరనుందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్ అన్నారు. శుక్రవారం ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తూళ్ల నర్సింహ గౌడ్, పలుస శ్రావణ్ కుమార్ గౌడ్, కొత్త రాంరెడ్డి పాల్గొన్నారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

- మినీట్యాంక్ వద్ద కొనసాగుతున్న విగ్రహాల నిమజ్జనం
- ఇప్పటి వరకు గంగమ్మ ఒడికి చేరిన 3,504 ప్రతిమలు

చైతన్యపురి: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద నిమజ్జన కార్యక్రమాలు సందడిగా జరుగుతున్నాయి. ఆయా ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు చేశారు. కట్ట మొత్తం భారీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిమజ్జనం సందర్భంగా వచ్చిన పత్రి ఇతర సామగ్రిని ఎప్పటికప్పుడు ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారు. మెట్రో వాటర్ బోర్డు ఆధ్వర్యంలో తాగునీటి కౌంటర్లు ఏర్పాటు చేశారు. తాత్కాలిక టాయిలెట్స్ అందుబాటులో ఉంచారు.

వన్ ఎన్ట్రీ.. వన్ ఎగ్జిట్ విధానం అమలు

◆ గురువారం సాయంత్రం వరకు సుమారు 3,504 విగ్రహాలు (మూడు అడుగుల పైన) నిమజ్జనం అయినట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. అలాగే బేబీపాండ్‌లో 390 నిమజ్జనం అయ్యాయన్నారు. చివరి రోజు శనివారం నిమజ్జనానికి తరలివచ్చే వాహనాలు వన్ ఎన్ట్రీ.. వన్ ఎగ్జిట్ విధానం అమలు చేస్తున్నామని అన్నారు.



నిమజ్జనాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న భక్తులు

80 ప్రత్యేక సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

◆ ప్రత్యేక బలగాలతో రాచకొండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చయటమే కాక వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. 80 ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్నారు. నేడు చివరి రోజు మినీ ట్యాంక్ బండ్ పరిసర కాలనీల నుంచి భారీగా విగ్రహాలు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



షాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

షాబాద్: మండల కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా ప్రదర్శన చేపట్టారు. మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ఏటా మిలాద్ ఉన్ నబీ పండుగను పెద్దఎత్తున నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా మజ్జిగ, శీతల పానీయాలు, పండ్లు పంపిణీ చేశారు. మత పెద్దలు మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త చెప్పిన శాంతి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా షాబాద్ సీఐ కాంతారెడ్డి, ఎస్ఐలు నవీన్‌రెడ్డి, సతీష్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు మజీద్, అఫ్జల్, ఇమ్రాన్, ఇబ్రహీం, షాఫీ, ముఖ్రమ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. అజ్ఞానం అనే చీకట్లను పారదోలి, జ్ఞానం అనే వెలుగులు నింపి విద్యార్థుల భవిష్యత్తుకు గురువులు పునాదులు వేస్తారన్నారు. ప్రతిఒక్కరూ నిత్య విద్యార్థే అన్నారు. గురువులతో శిష్యులకు ఉండే అనుబంధం ఎంతో మధురమైందని, అది వెలకట్టలేనిదన్నారు. పూర్వం విద్యార్థులు క్రమశిక్షణతో వెలిగేవారన్నారు. ప్రస్తుతం అలాంటి నియమాలు అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. నాటి గురువులకు ఎమ్మెల్యే పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో గురువులు కీలకం

షాద్‌నగర్‌రూరల్: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదన్నారు. సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమన్నారు. సన్మానం పొందిన వారిలో ఆనంద్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, శంకర్, వెంకటేష్, రమేష్, తిరుపతయ్య, యాదయ్య, గణేష్, నర్సింలు, నటరాజ్, రాజ్యలక్ష్మి, గుబ్బస్వామి, పద్మ, నర్సింలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రాంచంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ సాయికృష్ణ, మాజీ రీజియన్ చైర్మన్ నారాయణ, డిస్ట్రిక్ చైర్మన్ రమేష్, సహాయ కార్యదర్శి మురళి, సభ్యులు నర్సింహారావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: విశ్రాంత ఉపాధ్యాయుడికి పాదాభివందనం చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

మొయినాబాద్‌రూరల్: భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాలతి అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సర్వేపల్లి రాధాకృష్ణన్ అడుగుజాడలో పయనించి, విజ్ఞానం పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగినా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మరచిపోకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయశ్రీ, ఉషారాణి, కావ్య, రమ్య, కవిత, హర్షిత తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు